


# చికిలింత చిగురు సంపంగి గుబురు



మల్లాది పాట నాతో మాట్లాడిందిలా...

నా తండ్రి మల్లాది ఎంత గొప్పవాడని చెప్పేది. ఆరుద్రకు అనుమానం వచ్చినా, శ్రీశ్రీకి సందేహం కలిగినా చిటికెలో తీర్చగల తెలుగు విజ్ఞానబోధి, శ్రీశ్రీని సినిమాలోకి తీసుకొచ్చింది మల్లాది. పలు భాషలను నేర్చుకున్న బహుముఖీన ప్రజ్ఞ. ఇత్యాది ఎన్ని చెప్పినా, మల్లాది వారి ప్రతిభా విశ్వరూపం మాటలకు అందేది కాదు, ఎంత చెప్పినా తనివితీరేది కాదు.

చిరంజీవులు – సినిమాకు సంగీతం ఘంటసాల.

మనసైన చినదాని మీద మనసుపడ్డ పాట రాయాలి.

మనసంటే అందరికి తెలుసు. మనసంటే ఇష్టమని కూడా మనకు తెలుసు.

తను అలంకరించుకొని, తన గదినీ, పానుపునూ అలంకరించి ఎదురుచూసే వాసకసజ్జికల్లాగా... విరహంతో ఎదురుచూసే అభిసారికల్లాగా సుకుమారమైన ఎండకన్నెరుగని సుందరమైన తెలుగు పదాలు మల్లాది చూసు కోసం ఎదురుచూస్తుంటారు కదా!

ముందు మనసు గురించి 'గిలిగింత' 'పులకింత'... ఇలా బిందుపూర్వక తకారంలో చిన్న చిలిపిదనం ఉంటుంది. చిలిపిలోని 'చి' కూడా... గారాబంలోనూ, మారాంలోనూ, ఇష్టమైనవారి ముందు ఒలకబోసే సిగ్గుతనంలోనూ, 'చి' అక్షరం భలే ముచ్చటగా వినువేడుకగా ఉంటుందని అక్షరమర్మయోగి మల్లాదికి తెలియదా!

మనసు – చికిలింత చిగురు – 'చికిలింత'... మనోహరమైన, తేట అయిన, స్వచ్ఛమైన అనే అర్థంలో మొదలెట్టాడు.

మనసు – సంపంగి గుబురు – హృదయ నాసికలను మత్తెక్కించే సంపంగి గుబురును చిన్నదాని మనసుకు నిర్వచనంగా ఎంచుకున్నాడు.

(పాఠకులు ఒక విషయం గమనించాలి. పదాలను ఎంచుకోవడమంటే గంటలు గంటలు తర్జించి భర్జించి, నిఘంటువులతో చర్చించి కాదు సుమా! అలవోకగా అవే చెలిమెల్లా ఊరుతుంటాయి.)

ఆ తరువాత మల్లాది ఇక్కడ మనసుకు మరో మెరుపు అద్దాడు. నాయకుని ఉద్దేశం, పాట ముఖ్యోద్దేశం కలిపి చెప్పడానికి... 'చినదాని మీద మనసూ' అని 'మీద' అనేది లాగి పాడటం ఘంటసాల చమత్కార చాతుర్యం.

ఆ (తన యొక్క) మనసైన చినదానికి (ఆమె) అందానికి (తన) కనుసైగ మీద మనసుతో 'పల్లవి'ని యమాసుందరంగా చూపించాడు.

ఆ తర్వాత చరణం ఇలా మొదలుపెట్టాడు.

'చెంపకు చేరడేసి కన్నులున్న చిన్నదీ'... ఎవఱు? నట యమున జమున!

చిన్నదాని సిగలో రేకలెన్నో  
గువ్వ కన్ను... హవ్వ... నల్లరంగురైక అనొచ్చుగా!  
గువ్వకన్ను రైక మీద చుక్కలెన్నో

ఆ చుక్కలెన్నిసార్లు లెక్కిస్తేనే తప్ప మనసు చుక్కల మీదికెళ్లదు కదా! మరి ఆ లెక్కించిన చుక్కల రాయుడైన కథానాయకుడెవరు? ధీరలలిత ముఖుడు, జ్వలితాంతర్ముఖుడు... నటనానందమూరి తారకరాముడు!

పాట చివరిలో మళ్లీ మనసును 'మనసే మరుమల్లెల ఒందతర' అని మరో (బహువచనంతో) సువాసనల మరుమల్లెలతో వచించి, మన ఊసే విరజాజి దొంతర అంటాడు. ఇదంతా ఏ ప్రదేశంలో ఎక్కడ... ఎప్పుడూ మరీ! కేవలం పాలవన్నెలలోనే కాదు మురిపాల వెన్నెలలో అని ఊరిళ్ల మురిపాలనుమనలో ఊరించి పాట ముగించి పానగల్ పార్కులోకి మౌనతపస్విలా రిక్షా ఎక్కి (జీవితాంతం ఒక రిక్షా. ఆ రిక్షా నడిపిన వ్యక్తి పేరు 'చెల్లం'. రిక్షా పుల్లరును కూడా జీవితాంతం మార్చలేదు. అది మల్లాది కృతజ్ఞతావాత్సల్యం). అక్కడ వేచివున్న ప్రజ్ఞావంతులు, ప్రతిభావంతుల కళ్లలో సహస్రానేక నిగూఢ జ్ఞాన రహస్మంత్ర వెలుగులు అద్దడానికి వెళ్లిపోయాడు! అలా నేను పుట్టి, తర్వాత ఘంటసాల వారితో బాణీల ఓణీల కుట్టించుకుని, లీల – ఘంటసాల గొంతు వాకిట్లోంచి మీ వీనులలోకి పాట పల్లకి అయ్యానన్న మాట!

ఇప్పటికీ నేను ఆ పల్లకీ దిగనే లేదు సుద్దాలా! అని తనువు కూడా పానగల్ పార్క్ వైపే వెళ్లిపోయింది 'చికిలింత చిరంజీవినీ పాట'! ●

Compliments from
Sri Krishna Bhat
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
WOOD SIDE ANNEXE
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
WOODSIDE
HOTEL WOODSIDE
E.Car Street, Tirupathi. Ph : 2284464

We Provide your comfortable Stay and Tasty Food Hospitality
Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# తెలంగాణాలో ప్రఖ్యాత జానపద కళారూపం ఒగ్గు కథ

తెలంగాణాలో ప్రముఖ జానపద కళారూపమైన ఒగ్గు కథకు ఖ్యాతిని సముపార్జించి పెట్టిన కళాకారుడు చుక్కా సత్తయ్య. 1931 జూన్ 15న వరంగల్ జిల్లా జనగామ తాలూకా మాణిక్యాపురంలో సాయమ్మ, ఆగయ్య పేద కుటుంబంలో జన్మించారు.

చిన్ననాడు పొలాల్లో పనులుచేస్తూ నిసర్గసుందరమైన జానపద గీతాలను ఆలవోకగా ఆలపించిన చుక్కా సత్తయ్య 14 ఏళ్ల వయసులో రామాయణ, మహాభారత ఇతివృత్తాలతో కూడిన జానపద నాటకాల్లో రాముడు, హనుమంతుడు, రావణుడు మొదలైన అనేక పాత్రలు ధరించాడు. క్రమంగా ఇరవయ్యేళ్ళు నిండేనాటికి తెలంగాణా జానపద ఒగ్గు కథ వైపు ఆకర్షితుడయ్యాడు.

అప్పటివరకు ఒగ్గు కథ కురుమ కులాన్ని ఆశ్రయించి ఉండేది. ఒగ్గు పూజారులు పండగల్లో, పెళ్ళిళ్లలో మాత్రమే చెప్పిన ఒగ్గుకథను స్వయంకృషితో ఒక సమగ్ర కళారూపంగా మలచడంలో సత్తయ్య శ్రమ అపారమైంది. ఒగ్గు కథను ఒక కులం వారి కబంధ హస్తాలనుండి విముక్తం చేసి ఎంతోమంది ఇతరులకు నేర్పినది సత్తయ్యనే చెప్పాలి. ఒగ్గుకథలో సమున్నత శిఖరాలను అధిరోహించడానికి సత్తెయ్య చేసిన తపస్సు కఠోరమైంది.



చిన్నప్పుడు చదివిన బాలశిక్షకు మించిన చదువుతో, శతకాల శ్రుత పాండిత్యంతో ఒక్కటొక్కటిగా 35 కథలను సృజించుకున్న అసాధారణ అపారమైన సంపదకు ప్రతిభా సంపన్నుడు చుక్కా సత్తయ్య. నెలరోజుల పాటు నిర్విరామయంగా చెప్పగల కథను కాగితం, కలం సహాయం లేకుండా ఔపోసన పట్టిన అపర అగస్త్యుడు సత్తయ్య. ఇదంతా ఆ అమ్మవారి కటాక్షమేనని ప్రగాఢంగా విశ్వసిస్తాడు.

1960 ప్రాంతంలో ప్రారంభించిన ఒగ్గు కథా ప్రదర్శన 50 సంవత్సరాలుగా వన్నె తగ్గకుండా సాగిపోతున్నది. మాణిక్యపురం దాటి, జనగామ దాటి, ఓరుగల్లు దాటి యావత్ తెలంగాణలో వీరవిహారం చేస్తున్నది. తెలంగాణలోనే



ఒగ్గు కళ కళాకారుడు "డా. చుక్కా సత్తయ్య"కు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశిష్ట పురస్కారం

గాకుండా రాష్ట్రం నలుమూలలకు వెళ్లింది. మహారాష్ట్ర, ఢిల్లీ, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు... ఇలా యావద్భారతం చుట్టి వచ్చింది. అండమాన్, మలేషియాల్లోనూ గజ్జెకట్టి నాట్యమాడింది. తెలంగాణ నుడికి గుడి కట్టింది. సుమారు 12 వేల ప్రదర్శనలిచ్చారు సత్తయ్య.

ఇందిరాగాంధి, రాజీవ్‌గాంధి, పి.వి. నరసింహారావు వంటి ప్రధానుల చేత, నీలం సంజీవరెడ్డి, అబ్దుల కలాం వంటి రాష్ట్రపతులు, అంజయ్య, వెంగళరావు, ఎన్.టి.ఆర్ తదితర ముఖ్యమంత్రుల చేతుల మీదుగా సత్కారాలు అందుకున్నారు. స్వర్ణ కంకణ బహుకృతులు పొందారు. జానపద కళామూర్తి, ఒగ్గుకథా సమ్రాట్ వంటి బిరుదులందుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో గౌరవించింది. ప్రతిష్ఠాకరమైన కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. రాజీవ్ ప్రతిభా పురస్కారం పొందారు. తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల శాఖలో గౌరవ ఆచార్యత్వం వహించి ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దిన ఖ్యాతి చుక్కా సత్తెయ్యకే లభించింది.

# తెలుగు 'జగతి' ఎరిగిన జర్నలిస్టు ఎన్.ఆర్. చందూర్

ఎన్. ఆర్. చందూర్‌గా దేశవిదేశాల్లోని తెలుగువారందరికీ సుపరిచితులైన శ్రీ చందూరి నాగేశ్వరరావు (1916–2011) 'జగతి' మాసపత్రిక సంపాదకులుగా జగత్ప్రసిద్ధులు. ఆయన జగమెరిగిన జర్నలిస్టు. కథా రచయిత. ప్రచురణకర్త. గోదావరీ తీరంలో పుట్టి, ఏలూరులో పెరిగి, మద్రాసులో సాగరతీరాన స్థిరపడ్డ శ్రీ చందూర్, ఆయన శ్రీమతి – ప్రముఖ రచయిత్రి మాలతీ చందూర్‌లది చెన్నపట్నం తెలుగువారితో విడదీయరాని అనుబంధం. సాంస్కృతిక, సినీ, రాజకీయ రంగాల్లోని ఎందరో మహామహులకు సన్నిహితులు.



కొంతకాలం మద్రాసు ఆలిండియా రేడియోలో పనిచేసిన చందూర్ అటుపైన 'ఆంధ్ర మహిళా సభలో శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌కు సహాయకులుగా ఎన్నో ప్రచురణలకు సహకరించారు.

ఎన్.ఆర్. చందూర్ ఏలూరులో ఉన్న రోజుల్లోనే 'కథావీధి' అనే త్రైమాసిక కథల పత్రికను నడిపారు. ఆ అనుభవంతో, మద్రాసులో 'మాలి' మాసపత్రికను వెలువరించారు. 'మాలి'కి మరిన్ని మెరుగులు దిద్ది, 'జగతి'గా మార్పు చేశారు. అప్పటినుండి తుదిశ్వాస విడిచేవరకు ఒంటిచేతితో 'జగతి' మాసపత్రికను నడిపిన పత్రికా సంపాదకులు.

చందూర్ నడిపిన 'జగతి' పత్రిక ఖండాంతరాల్లో ఉన్న తెలుగువారికి సైతం నెలనెలా చేరుకొని, ఎన్నెన్నో సంగతులనూ, విశేషాలనూ పంచుతూ వచ్చింది. ఆయన రాసిన 'జగతి డైరీ' శీర్షిక తెలుగు సాహిత్య, సాంస్కృతిక సభల విశేషాలతో, మద్రాసులోని తెలుగువారి సంస్కృతికి చారిత్రక ప్రతిబింబం, మృదుస్వభావి, సహనశీలి అయిన ఎన్.ఆర్ చందూర్ నిబద్ధత, నియమపాలన కలిగిన జర్నలిస్టుగా ఆత్మీయత పంచి ఆదర్శప్రాయులయ్యారు. 'జగతి' ఎన్.ఆర్. చందూర్‌గా చరిత్రలో చిరస్మరణీయులయ్యారు. ఆయనెవరికీ వయసు చెప్పేవారు కాదు.

అదే తెల్లపంచె, అదే తెల్లచొక్కా, అదే కళ్ళజోడు. 75 సం॥ముల వరకూ మద్రాసులోని ఏ మారుమూలకైనా సైకిలు రిక్షాలోనే వెళ్ళేవారు. చివరిరోజుల్లో కారులో వెళ్ళేవారు.

ఎన్.ఆర్. చందూర్, బిఎస్సార్ కృష్ణ గోటేటి శ్రీరామారావు ముగ్గురము త్రివేణీ సంగమంలా ఉండిపోయాం. ఇన్ని దశాబ్దాలు పత్రికా రంగంలో ఉన్నది మనం. సాటిలేని మనంలో హెచ్చుతగ్గులు వొద్దు – అనేవారు. చందూర్ – బి.ఎస్సార్ – గోటేటిలో బేధాలు లేవు. ఈ ముగ్గుర్నీ చూచి మద్రాసు అకాడమీ టి.వి.కె. శాస్త్రి ప్రత్యేక కుర్చీల్లో కూర్చోబెట్టి ముగ్గురు ముసలోళ్ళు – అంటూ ముచ్చటించేవారు.

# జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య

## ఎనిమిది మీటర్ల నిడివిగల పట్టుచీరను - అగ్గిపెట్టెలో ఇమిడే విధంగా తీర్చిదిద్దినవాడు నల్లా పరంధాములు

## మువ్వన్నెల జాతీయ పతాకాన్ని ఒకే మగ్గంపై నేసిన చేనేత శ్రామిక శ్రేష్ఠుడు నల్లా విజయకుమార్ తండ్రీ కొడుకులిరువురూ ఒకరికి మించిన ఒకరు ప్రతిభావంతులు!

*అగ్గిపెట్టెలో ఇమిడిపోయేంత చేనేత పట్టుచీరను మగ్గంపై నేసి భారతీయ చేనేత కళానైపుణ్యాన్ని నేత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన చేనేత శిల్పి నల్ల పరంధాములు తనయులు నల్ల విజయ్‌కుమార్ చేనేత మగ్గంపై కుట్టులేని జాతీయ జెండాను నేశారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్లకు చెందిన విజయకుమార్ మూడు రంగుల జాతీయ జెండాను ఎలాంటి కుట్టు లేకుండా, అతుకు లేకుండా చేనేత మగ్గంపై నేశారు. మూడు రోజుల పాటు చేనేత మగ్గంపై శ్రమించి త్రివర్ణ పతాకాన్ని నేసిన నేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ నిత్య ప్రయోశాలిగా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు సాధించారు.*

### కుట్టులేని 'పట్టు' కళ

సిరిసిల్ల సాయినగర్‌కు చెందిన నల్ల విజయ్‌కుమార్ తండ్రి నల్ల పరంధాములు చేనేత శిల్పిగా గుర్తింపు పొందారు. తండ్రి చేనేత కళావారసత్వాన్ని తనయుడు విజయ్‌కుమార్ కొనసాగిస్తున్నారు. తొలిసారిగా నల్ల పరంధాములు 1987లో ఎనిమిది మీటర్ల పొడవున్న చీరను పట్టుదారలతో అగ్గిపెట్టెలో ఇమిడిపోయే విధంగా నేసి చేనేత వైభవాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు. కుట్టులేని షర్టును, కుట్టు లేని జాకెట్‌ను మగ్గంపై నేసి చేనేతతో అద్భుతాలను ఆవిష్కరించారు. 1997లో నల్ల పరంధాములు నేసిన 112 మీటర్ల జాతీయ జెండాను అట్లాంటాలో జరిగిన ఒలింపిక్ వేడుకల్లో భారతీయ క్రీడాకారులు ప్రదర్శించారు. ఎలాంటి కుట్టు లేకుండా పరంధాములు చేనేత మగ్గంపై దానిని నేశారు. చేనేత మగ్గంపై పరంధాములు చేసిన అద్భుతాలకు అవార్డులు వచ్చాయి. కానీ రెక్కాడితే కానీ డొక్క నిండని కార్మికుడైన పరంధాములు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పరంధాములు చేనేత మగ్గంపై వస్త్రం నేస్తూ... బీడీలు చుడుతూ... కుటుంబాన్ని పోషించారు. ఆర్థిక ఇబ్బందులను అనుభవిస్తూ... 2006 ఆగస్ట్ 13న పరంధాములు కన్నుమూశారు. మొన్న శనివారం నాటికి పరంధాములు మరణించి పదేళ్లు అవుతోంది.



చేనేత శిల్పి
నల్ల పరంధాములు




### కష్టాన్ని గుర్తిస్తేనే కళకు గుర్తింపు

*మా నాన్న చేనేత కళా వారసత్వాన్ని కొనసాగించేందుకు ఈ ప్రయోగాలు చేశాను. ఆర్థికంగా ఇబ్బందులున్నా, ఇలాంటి ప్రయోగాలతో గుర్తింపు సాధించాలని పని చేస్తున్నాను. ప్రభుత్వపరంగా ఆర్థిక సాయం అందిస్తే... చేనేత కళావైభవాన్ని భావితరాలకు చాటిచెప్పేందుకు కృషి చేస్తాను.*

**- నల్ల విజయ్‌కుమార్,** చేనేత కార్మికుడు, సిరిసిల్లా

### అదే మగ్గం... అవే అద్భుతాలు!

పరంధాములు తనయుడు నల్ల విజయ్‌కుమార్ తండ్రి బాటలోనే చేనేత మగ్గంపై ప్రయత్నాలు చేస్తున్నారు. తండ్రి చేనేత వారసత్వాన్ని కొనసాగిస్తూ... 2012లో అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీరను నేశారు. 8 మీటర్ల పొడవుండే పట్టు చీరను కేవలం వంద గ్రాముల బరువుతో నేసి అబ్బురపరిచారు. 2012లోనే అగ్గిపెట్టెలో ఇమిడిపోయే పట్టు శాలువాను నేశారు. 2013లో దబ్బనంలో దూరే ఐదు మీటర్ల చీరను నేశారు. 2014లో మూడు రకాల డిజైన్లతో మూడు కొంగులతో చీరను, బంగారం పోగులతో మగ్గంపై బ్రాస్‌లెట్‌ను చేనేత మగ్గంపై నేసి శభాష్ అనిపించుకున్నారు. 2015 అరటి నారలతో శాలువాను నేసి ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు బహుకరించారు. సిరిసిల్ల నల్ల విజయకుమార్ చేనేత ప్రయోగాలకు గుర్తింపు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ చేనేత కార్మికుడి అవార్డును రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అందించింది.

తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా విజయ్‌కుమార్ నేసిన అగ్గిపెట్టెలో ఇమిడే చీరను అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, తమిళనాడు గవర్నర్ రోశయ్య ఆవిష్కరించి సత్కరించారు. నాలుగేళ్లుగా విజయ్‌కుమార్ నిత్య ప్రయోగాలతో ముందుకు సాగుతున్నారు. ●

**జనని సాంస్కృతిక సంస్థ రజితోత్సవం జరుపుకుంటుందంటే ఎంతో ఆనందంగా ఉన్నది!**

*నిర్మలా పళనివేలు, గుడిమెట్ల చెన్నయ్యల సాహితీ కృషీవలత్వమే* ***జనని.***

*జనని తెలుగు భాషకు చేస్తున్న అవిశ్రాంత సేవ అనుపమానం. వారికి సహాయంగా ఉన్న ఉప్పలదడియం వేంకటేశ్వర్లుకు శుభాశీస్సులు.*

# నాగినేని వెంకయ్య

“పురుషులందు పుణ్యపురుషులు వేరయా” అనే వేమన సూక్తికి, “ఉద్ధతులుగారు బుధులు సమృద్ధిచేత” అను భర్తృహరి సుభాషితానికి ఉదాహరణగా నిలుస్తాడు శ్రీ నాగినేని వెంకయ్య.

**పురుషుండు రెండు తెరగుల**
**ధరనుత్తము దనగబరగు దానెయ్యెడలన్**
**పరుసములు పలుకకునికి**
**దురితంబులు వొరయు పనులు దొరగుట కతనన్ ॥**

అను భారతనీతులు వీరి జీవితంలో ప్రతిఫలించనవన్న అతిశయోక్తి కానేకదు.

జీవితం భోగవిలాసాల కొరకుగాక, అనేక విధుల నిర్వహణ కుపయోగపడ వలెనను జాతిపిత ప్రవచనాన్ని అమలు జరుపుతున్న శ్రీ వెంకయ్య తన త్యాగమయ జీవితం ద్వారా చరితార్థుడైనాడు. తోడి మానవుల అభివృద్ధికై తానెంతగా పాటుపడునో దానినిబట్టి మనిషి గొప్పతనం నిర్ణయమవుతుందన్నాడు మహాత్మాగాంధి. కర్తవ్యపాలన పట్ల ఏమరుపాటు నెరుగని కర్మ వీరుడగుటచే శ్రీ వెంకయ్య పదవులకొరకు ప్రాకులాడలేదు. తాను నమ్మిన ఆశయ నిర్వహణకు జీవితాన్ని అంకితం చేసుకొన్నాడు. తన ధనాన్ని, శక్తిని, కాలాన్ని, దీనికొరకై వినియోగించాడు. తనది భారీ కుటుంబం అయినప్పటికీ, కుటుంబ భారంతోపాటు సంఘసేవా బాధ్యతను కూడా పైన వేసుకొని విడువకుండ సాగిస్తున్నాడు.

ప్రపంచానికి అన్నదాత, దేశానికి వెన్నెముఖ అయిన కృషీవలుని సేవకుపూని 70వ పడిలో కూడ నడుంగట్టి పనిచేస్తున్నాడు. “పల్లెటూళ్ళ దయనీయస్థితి దేశ దౌర్భాగ్యానికి కారణం. పేదరికం, అవిద్య పల్లెప్రజలను పట్టి పీడిస్తున్నవి. ప్రజా సామాన్యం విద్యావంతులైననాడు ఈ దుస్థితి తొలగిపోగల”దను భావన స్వామి వివేకానందుని నాటి నుండి ప్రచారంలో నున్నది. నేటి కాలపు విద్యను సాంప్రదాయికంగా అభ్యసించి పట్టభద్రుడు కాకున్నను, జీవితానికవసరమైన జ్ఞానాన్ని గ్రంథ పఠనం ద్వారా స్వయంకృషితో సంపాదించినాడు. కులవృత్తియైన వ్యవసాయంలో తెలుగులో వెలువడిన కీ.శే. గోటేటి జోగిరాజుగారి వ్యవసాయ గ్రంథాల పఠనం ద్వారా చక్కని శాస్త్రజ్ఞానాన్ని సంపాదించి, దీనిని తన వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకొన్నాడు. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘం నిర్వహిస్తూ వచ్చిన గ్రంథాలయక శిక్షణ తరగతులలో, గ్రంథాలయ వయోజనవిద్యా శిబిరాలలో తాను నేర్చిన, అనుభవం ద్వారా పొందిన జ్ఞానాన్ని గురించి ప్రసంగాలు చేస్తూ వచ్చాడు. అదేవిధంగా ఆరోగ్యసంబంధంగా, సాంఘిక ఆర్థిక రాజకీయ విషయాలలోను ఎంతో సమాచారాన్ని సేకరించుకొనుటయేగాక, దీనిని విశ్లేషణ చేసి ఆయా రంగాలలో ఎప్పటికప్పుడుత్పన్నమయ్యే సమస్యలకు చక్కని పరిష్కారాలను సూచించడం వీరికి పరిపాటిగా నున్నది. జనసామాన్యంలో విజ్ఞాన ప్రచారం యొక్క ఆవశ్యకతను బాగుగా గుర్తించినందున రైతు ఉద్యమంతోపాటు వయోజనవిద్య, గ్రంథాలయోద్యమాల కార్యక్రమాన్ని చేపట్టి కొనసాగిస్తున్నాడు.

భారతదేశానికి పునాదియగు గ్రామీణవ్యవస్థ పటిష్ఠంగా ఉనప్పుడే మనజాతి అభివృద్ధికి ఆస్కారముంటుంది. దీనికొరకు మహాత్మాగాంధి తలపెట్టిన గ్రామోద్ధరణ కార్యక్రమం పట్ల శ్రీ వెంకయ్యగారికి దృఢమైన విశ్వాసమున్నది. కనుకనే మంది బలం కొరకు ఎదురుచూడక తాను ఏకాకిగ దీక్షతో ఈ పనిని కొనసాగిస్తున్నాడు.

నిరాడంబరంగా నడుస్తున్న వీరి కార్యక్రమానికి తగిన ప్రచారం లేదు. అందుచేత వీరి విషయం ప్రపంచానికంతగా తెలియదు. ఈ లోపాన్ని తొలగించుటకు ప్రస్తుతం వారికి జరుగుతున్న సన్మానం, యీ సందర్భంగా వెలువడుతున్న అభినందన సంచిక కొంతవరకు ఉపయోగపడగలదని తలుస్తున్నాము.

శ్రీ వెంకటయ్యగారి వైశిష్ట్యం వారి శీలసంపదయని చెప్పవచ్చు. మానవ జీవితంలో శీల నిర్మాణానికి గల ప్రాముఖ్యాన్ని గురించి మహాపురుషులందరూ నొక్కి వక్కాణించారు. “ధనం కోలుపోతే తిరిగి సంపాదించవచ్చు. ఆరోగ్యం చెడిపోతే చికిత్సద్వారా దానిని చక్కజేయవచ్చు. కాని భ్రష్టుపట్టిన శీలాన్ని చక్కదిద్దడం సాధ్యం కాదం”టాడు స్వామి వివేకానంద. “మంచి నడవడి మనిషికి గౌరవాన్ని సంపాదిస్తుంది. నీతిలేని వారు లోకనిందకు పాత్రులవుతారు. కనుక మానవుడు నీతి విద్యను నేర్వవలయు” ననునది పెద్దల సుద్ది. దీనిని అక్షరాల అమలుచేస్తూ మన వెంకయ్యగారు లోకంలో శీలవంతుడుగా గణుతికెక్కినాడు.

– పాతూరి నాగభూషణం


## శ్రీకృష్ణ

అనేకమంది పెద్దల ఆశీస్సులు పొందిన 276 పేజీల గ్రంథం.
మూల్యం 200 రూపాయలు.
కొరియర్, రిజిష్టర్డు పోస్టు ఛార్జీలకూ రూ. 25లు చేర్చి,
రు. 225 రూపాయలు పంపండి. అదనపు ఛార్జీలను మేమే భరిస్తాం.

## ఆధ్యాత్మ రామాయణం

ఈ గ్రంథ ప్రతిని మరో 120ల్ను అదనంగా పంపించినచో
రెండు గ్రంథాలనూ ఒకే పోస్టులో పంపిస్తాం.
పంపించే డబ్బును ప్రముఖాంధ్ర పేరిటనే ,
ప్రముఖాంధ్ర అడ్రసుకే పంపండి.

**జీ.వి. రావ్ పేజీ** (గోటేటి వేంకటేశ్వరరావు)

కళ్లకు మన చేతులను అడ్డుపెట్టుకుని అంతటా చీకటి అని విలపిస్తున్నాం.
అలాగే మనస్సుకు దుర్భలతను ఆపాదించుకుని బలహీనులమని విలపిస్తున్నాం.

- స్వామి వివేకానంద




# చెన్నై వాసుల నలరించిన చాగంటి వారి “వివాహ విశిష్టత” ప్రవచనం

చెన్నైలోని తెలుగువారందరూ క్యాలండర్‌లో పండుగలను గుర్తించుకున్నట్టు ప్రతి సంవత్సరం మూడు రోజులు చాగంటివారి ప్రవచనాన్ని గుర్తుంచుకుంటారు. దాని కోసమే కాచుకుని ఉన్నట్టుగా ఆ ప్రవచన వార్త తెలియడమే ఆలస్యం ఆ కుచలాంబాళ్ ప్రాంగణానికి వచ్చేస్తారు. ఈసారి సాయంత్రం 6 వరకు తమిళనాట బంద్. అయినా సరే పిల్లాపాపలతో పెద్దలందరూ సాయంత్రం అసౌకర్యాలన్నిటిని అధిగమించి ఆరుగంటలకల్లా హాలులోకి వచ్చేసారు. ఆరున్నరయ్యేలోపలే హాలు కళకళలాడుతూ నిండుకుంది. ప్రక్క హాలులోకి వెళ్ళి కూర్చున్నారు. ఎప్పటిలా. “వివాహ విశిష్ఠత” అన్న వెంటనే నేను వివాహ తంతు గురించి చెపుతారా? లేక దేవతలు వివాహాలు వాటి విశిష్టత చెపుతారా అని అనుకుంటూ నామదిలో మెదిలే సందేహాలతో వెళ్ళాను. కాని ఆయన అసలు వివాహమంటే ఏమిటి? మనకుండే నాలుగు ధర్మాలలో గృహస్థ ధర్మాన్నికుండే ప్రాశస్త్యం దాని గొప్పదనం బహు చక్కగా వివరించారు. భార్యాభర్తలు సీతారాముల్లా వుండాలని చెపుతూ, పరమాచార్య, నడయాడే దేవుడు కంచి శంకరులు శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి వారు కళ్యాణ శుభలేఖలో తప్పని సరిగ ఎందుకు సీతారాముల ఫోటో వెయ్యమంటారో చక్కగా చెప్పారు. సీతారాములు వేరువేరు కాదు,



అది ఒక నామమే సీతరాముడు, రాముడే సీతా అని చెప్పారు. దంపతులు ఇద్దరైనా వారి ఆలోచనలు గుణగణాలు, స్వభావం, ఆలోచనా ఒకటిగానే వుండాలని అప్పుడే ఆ సంసారం సుఖంగా జరుగుతుందని, వారనుకున్న లక్ష్యాన్ని చేరగలరని చెప్పారు. వివాహం అనే తంతు ఒకరోజుకే పరిమితం కాదని, ఆ వివాహ మంత్రాలకు అర్థాలు జాగ్రత్తగా గమనిస్తే జీవితాంతం కలిసి జీవించేందుకు ఎన్నో అర్థాలున్నాయని చెప్పారు. తన తండ్రి ఎలాగైతే వివాహం చేసుకుని తనకు జన్మనిచ్చాడో అలాగే తను వివాహం చేసుకుని తనూ ఓ జీవికి జన్మనిచ్చి ఆ తంతునలాగే గొలుసుకట్టులా తీసికెళ్ళాలని, ధర్మం అదే చెపుతూందని, శాస్త్రం ప్రమాణం చెప్పారు. అలాగే వివాహం చేసుకునేటప్పుడు రెండు కుటుంబాలు సమ్మతంతోనే జరగాలని, అలాగే సీతారాముల కళ్యాణం జరిగిందని, రాముడు శివధనుస్సు ఎక్కుపెట్టి స్వయంవరంలో సీతను పెళ్ళి చేసుకోలేదని, జనక, దశరథులు, వశిష్ఠ, విశ్వామిత్రులు కూర్చుని వారి వంశం, వీరి వంశం పెద్దల సమక్షంలో వంశావళి గొప్పతనం తెలుసుకుని చేసుకున్నారని చెప్పారు. భార్యాభర్తలనేవారు ఒక బండికున్న రెండు చక్రాలలాంటివారని, రెండూ సమానంగా వుండాలని ఒక చక్రం పెద్దదిగా, ఒక చక్రం



శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారికి భారతీయ సాంస్కృతిక పీఠంచే “ప్రవచనా సార్వభౌమ” బిరుదు ప్రదానం



చిన్నదిగా వుంటే బండి ఎలా నడవదో అలాగే వారిరువురూ ఒకరి గొప్పతనాన్ని ఒకరు గుర్తిస్తూ సంసారం చెయ్యాలని చెప్పారు. అలాగే మంగళసూత్రం విశిష్టతను బహు చక్కగా చెప్పారు. స్త్రీలు ఎట్టి పరిస్థితులలోనూ మంగళసూత్రం తీయకూడదని, అది వున్నంతవరకూ భర్తకు ఎటువంటి గండముండదని వివరించారు. శరీరాకృతినీ వివరిస్తూ, తలలో జ్ఞానేంద్రియాలు, మెడకు క్రిందగా కర్మేంద్రియాలు వున్నాయని ఈ రెండింటి మధ్యనున్న మెడకి మంగళసూత్రం కడుతున్నారన్నారు, మాంగల్యధారణ సమయంలో సర్వమంగళాదేవిని ఆవాహనం చేసి ఆ సూత్రానికి బలం చేకూర్చి తరువాత మాంగల్యధారణ చేస్తున్నారని చెప్పారు. అలాగే భార్య గొప్పదనాన్ని చెపుతూ పరస్త్రీ వ్యామోహం ఎంత అనర్ధదాయకమో వివరాలు చెప్పారు. రావణాసురుడంతటి గొప్పవాడు సీతమ్మ తల్లిని బంధించినందువల్ల అతనిని ఉదహరిస్తూ జరిగిన అనర్థాలన్నీ వివరించారు. మండోదరి పతివ్రత అయినా పరస్త్రీ వ్యామోహం రావణాసురుడిని కాపాడలేక పోయిందన్నారు. ఈ విషయాన్ని ఇంకొంత లోతుగా చెపుతూ పాయసం బంగారు పాత్రలో వున్నా, వెండిపాత్రలో వున్నా, ఇత్తడి పాత్రలో వున్నా, అరిటాకులో వున్నా ఒకటేనని పాత్రలు వేరువేరుకానీ పాయసమొకటేననీ చెపుతూ ఇంతమంది వున్న సభలో ఇంతకన్నా చెప్పలేనని చాలా అర్ధవంతంగా చెప్పారు. బాహ్య సౌందర్యం ఒక్కటే ముఖ్యం కాదని ఇద్దరికి అవగాహన పరిణతి కూడా వుండాలని, ఇవన్నీ పరిశీలన చేసేందుకు అనుభవజ్ఞులైన పెద్దలు నిశ్చయించాలని చెప్పారు. వివాహ శుభలేఖలో ఏతత్ శుభముహూర్తము పెద్దలు నిశ్చయించినారు కావున... అంటే ఇదే అర్థమని వివరించి చెప్పారు.

అలాగే విడాకులు అనేవి భారతీయ సంస్కృతి కాదని అందుకే మన సంస్కృతి సంప్రదాయాన్ని విదేశీయులందరూ కీర్తిస్తున్నారని చెప్పారు. మంగళసూత్రధారణ, జీలకర్ర బెల్లం, తలంబ్రాలు, కంకణధారణ మొదలైన వాటిని గురించి వాటి విశిష్టతను చెపుతూ వాటికి సంబంధించి జనబాహుళ్యంలో వున్న అపోహలను కొట్టివేస్తూ సరళమైన పదాలతో అందరికి అర్థమయ్యే రీతిలో చాలా చక్కగా వివరించారు.

ఏ విషయాన్నైనా సూటిగా ప్రజలకు అర్థమయ్యేలా, మనసుకు హత్తుకునేలా చెప్పగలుగుతున్నారు కాబట్టే వారికి అంతటి గౌరవమర్యాదలు. జనం ఈరోజు ఆయనకు నీరాజనం పడుతున్నారంటే అదే కారణం. అందుకే ఆయన "ప్రవచన సార్వభౌమ."

భారతీయ సాంస్కృతిక పీఠం కృష్ణారావు గారు చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచనాలను గత ఐదేళ్ళుగా జరుపుతున్నారు. సంవత్సరం సంవత్సరం ఏదో కొత్తదనం, అదే చెక్కుచెదరని ఉత్సాహం, క్రమశిక్షణ, కార్యాచరణ. చెన్నైలో ఏ కార్యక్రమానికి రానంత జనసందోహం. ఈ సంవత్సరం ఎంచుకున్న అంశము చాలా బాగుంది. అలాగే ఆదివారం జరిగిన శివపార్వతుల కళ్యాణం. కాకినాడకు చెందిన వేదపండితులు సుబ్రహ్మణ్యశర్మగారి బృందం కడు భక్తిశ్రద్ధలతో కళ్యాణాన్ని జరిపించారు. ఈ మూడు రోజులు భక్తజనసందోహం అదే ఉత్సాహంతో పాల్గొన్నారు. శ్రీ చాగంటి కోటేశ్వరరావు గారిని పీఠం తరఫున "ప్రవచనా సార్వభౌమ" బిరుదుతో సత్కరించారు. ఎప్పుడు బిరుదులు, సత్కారాలకు దూరంగా వుండే చాగంటివారు చెన్నై వాసుల అలవికాని అభిమానానికి కృతజ్ఞతగా ఈ బిరుదుని స్వీకరించారని నా భావన. మళ్ళీ సంవత్సరం ఎప్పుడొస్తుందా, మళ్ళీ అంత చక్కని మాటలు ఎప్పుడు వింటామా అని మీలాగే నేను ఎదురుచూస్తున్నారు.

* * *

మనకు స్వాతంత్ర్యము వచ్చి దేశ విభజన జరిగినా తీరని సమస్యగా మారినది కాశ్మీరు. ఆ కాశ్మీరు భూతల స్వర్గం. ఒకప్పుడు కాశ్మీరి పండిట్లతో సస్యశ్యామలంగా వుండేది. కాని దేశ విభజన జరిగాక మెజారిటీగా వున్న పండిట్లను ఒక పద్ధతి ప్రకారం అక్కడినుండి పంపించి ఇప్పుడది సమస్యాత్మక ప్రాంతంగా ప్రపంచ అంతా దానిగురించి చర్చించుకునేంతగా చేసాము అంటే అది మన చేతగానితనం. స్వాతంత్ర్యము వచ్చాక కాస్త భోగాలకు అలవాటుపడ్డ రాజకీయ నాయకుల నీచగుణానికి ప్రతీక. వారు వారి కుటుంబం బాగుంటే చాలని భావించే నాయకులు ఈ సమస్యను వీలయినంత పెద్దది చేసారు కానీ దాన్ని పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. పాకిస్థాన్ మనలను యుద్ధంలో గెలవలేదు కనుక కొంతమంది హింసాత్మక తీవ్రవాదులను, చదువుకున్న తీవ్రవాదులను కూడా మన భూభాగంలోకి పంపి మనల్ని దొంగ దెబ్బ తీస్తూనే వుంది. దానిని సమర్ధవంతంగా ఎదుర్కొనవలసినది పోయి మనం వారికి మన జవానులను, జనులను వారికి బలిదానం ఇస్తూనే వున్నాం. ఆకాలంనుండి సనాతన ధర్మాన్ని పాటిస్తున్నందువల్ల స్వతహాగా మనం ధార్మికులం కాబట్టి అధర్మంగా పోకుండా బయట దేశాల వారికి పాకిస్థాన్ గురించి చెపుతూనే వున్నాం. ఇంతవరకు జరిగిన యుద్ధాలలో మనమే గెలిచాం. కాని ఇప్పుడు పాకిస్థాన్ యుద్ధం మన భూభాగంలోనే అధర్మంగా చేస్తోంది. దీనికి కొంతమంది మేధావులు తోడయ్యారు. యూనివర్సిటీ విద్యార్థులు, గురువులు ఒకరేమిటి అందరూ తయారయ్యారు. వారికి అండగా అమ్ముడుపోయిన ఇంగ్లీషు మీడియా డబ్బుకి కొందరు, ఈ యుద్ధాన్ని ప్రస్తుత ప్రభుత్వం సమర్ధవంతంగా ఎదుర్కొన్నప్పుడు చాలా సమస్యలు సృష్టించారు. అవార్డులు తిరిగి ఇప్పించి ప్రభుత్వాన్ని అవమానపరిచారు. యూనివర్సిటీలో వాక్ స్వాతంత్ర్యం పేరిట టెర్రరిస్టులు వర్ధంతులు, జయంతులు చెయ్యడం ప్రారంభించారు. కాశ్మీరులో అల్లరి సృష్టిస్తూ పాకిస్థాన్ జెండాలు ఎగురవెయ్యడం ప్రారంభించారు. ఇటీవల ఒక టెర్రరిస్టును కాల్చి చంపడం సహించలేక వాడినే స్వాతంత్ర్య సమరయోధుడిగా అభివర్ణిస్తూ దరిదాపుగా రెండు నెలలు కాశ్మీరులో కల్లోలం సృష్టించి కర్ఫ్యూ విధించేట్టు చేసారు. ఇలా మనదగ్గిర తల్లి పాలు తాగి రొమ్ముగుద్దే వెధవల సాయంతో మన వేలితో మన కన్ను పొడిపించారు. వీటన్నిటిని ఆధారాలతో చూపిస్తూ మెల్లిగా మన వాదనను వినిపిస్తూ ప్రపంచానికి పాకిస్థాన్ నిజస్వరూపం తెలిసేట్టు చేసింది ప్రస్తుత ప్రభుత్వం. భారతదేశ ప్రజలు కాస్త కళ్ళు తెరిచారు. అనుకూలమైన ప్రభుత్వం వుండడంతో అవకాశవాదులతో సమానంగా దేశభక్తులు తమ గొంతు వినిపించడం ప్రారంభించారు. మొన్న జరిగిన "సర్జికల్ స్ట్రైక్" పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ (అది భారత భూభాగమే) లోని తీవ్రవాద స్థావరాల మీద భారత సైనికులు జరిపిన దాడి – పాకిస్థాన్‌కు ఉక్కపోత కలుగచేసింది. దొంగకు తేలు కుట్టినట్టయ్యింది. సిగ్గుపడవలసినది పోయి అసలు దాడే జరగలేదని బుకాయిస్తోంది.

ఏ విదేశం వారు మనం చేసినపని తప్పనలేదు. మనలను సమర్థించారు. ఎందుకంటే పాకిస్థాన్ టెర్రరిస్టుల అడ్డా. ఎక్కడ దాడి జరిగినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాకిస్థాన్ హస్తం వుంది. దేశంలోను ప్రజలందరు హర్షం వ్యక్తం చేసారు. కాని మనం ఇంకా అప్రమత్తంగా వుండాలి. పాకిస్థాన్‌కు బుద్ధి వస్తుందని నేననుకోను. వారింకా విజృంభిస్తారు. మనం ఏదైనా గుణపాఠం వారికి నేర్పుతూనే వుండాలి. దెబ్బకు దెబ్బ రెండింతలు తియ్యాలి. ఇదీ ప్రస్తుతం ప్రతి భారతీయుడి కోరిక, ఆకాంక్ష. జైహింద్, భరతమాతాకు జై. ●

# GOTETI GRAPHICS

Office Stationery Printing
Visiting Cards, Wedding Cards, Invitation Cards,
Books, Journals, Annual Reports & Souvenirs
...........everything in Printing.

Digital Printing

Mini Offset & Offset

Soft
Hard
Spiral
Binding

64 (16), Thambiah Road, West Mambalam,
Chennai - 600 033. INDIA
Tel : +91-44-2474 2091, 2371 6322
E-mail : gotetigraphics@gmail.com

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
October 2016

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

